# సాక్షి
## పశ్చిమగోదావరి

శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024






### ఆక్వాకు ఆక్సిజన్ గండం

వాతావరణంలో మార్పులు ఆక్వా రైతులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. వాతావరణం చల్లబడటంతో చెరువుల్లో ఆక్సిజన్ సమస్య తలెత్తుతోంది. 10లో ▸



### చెరువులు కొట్టివేత

కొల్లేరులో అటవీశాఖ అధికారులు అక్రమ చెరువుల కొట్టివేత చేపట్టారు. ఏలూరు రూరల్ మండలంలోని నాలుగు చెరువులను కొట్టివేశారు. 10లో ▸



### ఎవరి రోడ్డు వారే బాగు చేసుకోవాలి

కూటమి పాలనలో ఎవరి సమస్యలు వారే తీర్చుకోవాలి అన్నట్టు ఉంది. ఏలూరులోని 18వ డివిజన్‌లో రోడ్డు అధ్వానంగా ఉండటంతో స్థానికులే బాగు చేసుకుంటున్నారు. 10లో ▸

## న్యూస్‌రీల్

### వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ నియామకం




భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు కేటాయించిన వివిధ పార్టీ పదవులను కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.

- **ఉపాధ్యక్షులుగా..** కర్రి రామలింగేశ్వరరెడ్డి (ఆచంట), బుద్దరాతి భరణి ప్రసాద్ (తణుకు), పెనుమత్స దుర్గా ప్రసాదరాజు (ఉండి), పప్పుల రామారావు (నరసాపురం), బండారు నాగు (తాడేపల్లిగూడెం), మేడిద జాన్సన్ (భీమవరం).
- **జనరల్ సెక్రటరీలుగా..** దంపన బోయిన బాబూరావు (ఆచంట), మల్లిరెడ్డి నాగార్జున (తణుకు), కొలుపూరి శివ కిరణ్ (తాడేపల్లిగూడెం), పాలా రాంబాబు (నరసాపురం). ట్రెజరర్‌గా.. వేగేశ్న జయ రామకృష్ణంరాజు (ఉండి).
- **ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా..** దిద్దే శ్రీను (ఆచంట), సత్తి వెంకట రెడ్డి (ఆచంట), ఇందుగుపల్లి బలరాం కృష్ణ (తణుకు), వెలగల అమ్మిరెడ్డి (తణుకు), గుండా సుందరామ నాయుడు (ఉండి), పల్లెం అరుణకుమారి (ఉండి), దేవ రంజిత్ కుమార్ (నరసాపురం), బోణం వీరయ్య (తాడేపల్లిగూడెం), చిటకన ప్రసాద్ (తాడేపల్లిగూడెం), కలిదిండి బలరామరాజు (భీమవరం), గోడి షణ్ముఖరావు (భీమవరం).
- **సెక్రటరీ యాక్టివిటీలుగా..** గొల్లపల్లి బాలకృష్ణ (ఆచంట), సుంకర నాగబాబు (ఆచంట), కోట నాగేశ్వరరావు (తణుకు), పాలా సత్యనారాయణ (తణుకు), సీహెచ్ పాపారావు (ఉండి), ఆదాడ నర్సింహరావు (ఉండి), తిరుమాని రామకృష్ణంరాజు (నరసాపురం), ముసుడి రత్నం (నరసాపురం), కడలి రాంబాబు (నరసాపురం), బుద్దని శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), పరిమి తులసీ దాసు (తాడేపల్లిగూడెం), పి.నర్సింహ స్వామి (భీమవరం), కాంట్రేగుల శ్రీను (భీమవరం).
- **అధికార ప్రతినిధులుగా..** ఏడిద కోట సత్యనారాయణ (నరసాపురం), భూసారపు జయ ప్రకాష్ (నరసాపురం), కర్రి గంగాధర అప్పారావు (తణుకు), గొర్రిముచ్చు సుందర్ కుమార్ (ఉండి), గుబ్బల వీర బ్రహ్మం (ఆచంట), ముప్పిడి సంపత్ కుమార్ (తాడేపల్లిగూడెం), కామన నాగేశ్వరరావు (భీమవరం)లను నియమించారు.

### వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని మండలాలకు పార్టీ అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. నరసాపురం పట్టణం కామన బాల సత్యనారాయణ, నరసాపురం మండలం ఉంగరాల రమేష్, మొగల్తూరు మండలం రేవు నారాయణరాజు, ఉండి మండలం పెన్మెత్స వెంకట రామకృష్ణ ఆంజనేయ రాజు, కాళ్ల మండలం గణేశ్న నాగ వెంకట శ్రీరామ సత్య స్వామి నాయుడు (రాంబాబు), పాలకోడేరు మండలం పాలా రాంబాబు, ఆకివీడు మండలం నంద్యాల సీతారామయ్య, ఆకివీడు పట్టణం అంబటి రమేష్‌ను నియమించారు. ఆచంట మండలం జక్కంశెట్టి చంటి, పెనుగొండ మండలం వేణుప్రతాప్ రెడ్డి, పెనుమంట్ర మండలం మనదూరు దేవేంద్రుడు, పోడూరు మండలం పిల్లి నాగన్న, తణుకు పట్టణం మంగెన సూర్య, అత్తిలి మండలం పైబోయిన సత్యనారాయణ, ఇరగవరం మండం కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, తణుకు మండలం బోడపాటి వీర్రాజు, తాడేపల్లిగూడెం పట్టణం కొలుకులూరి ధర్మరాజు, తాడేపల్లిగూడెం మండలం జడ్డు హరిబాబు, పెంటపాడు మండలం కైకాల శ్రీనివాసరావు, భీమవరం పట్టణం గాదిరాజు రామరాజు, భీమవరం మండలం జల్లా కొండయ్య, వీరవాసరం మండలం చవ్వాకుల సత్యనారాయణలను అధ్యక్షులుగా నియమించారు.

### నేడు విద్యుత్ శాఖ సీఎండీ సమీక్ష

భీమవరం: విద్యుత్ శాఖ అధికారులతో ఆ శాఖ సీఎండీ శుక్రవారం సమావేశం నిర్వహించనున్నారు. భీమవరం విష్ణు కళాశాలలో ఉదయం భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం డివిజన్లలోని ఈఈ, డీఈఈ, ఏఈ, ఏఏఓ, సర్కిల్ ఫైనాన్స్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు.

**విచారణ అధికారిని మార్చాలని..**

జగనన్న కాలనీల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల అవకతవకలపై విచారణను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోల్‌మాల్ వ్యవహారంలో ఏడీఈ స్థాయి అధికారిపై విచారణ జరగాల్సి ఉండగా అదే క్యాడర్ అధికారిని నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీఈ స్థాయి అధికారిని విచారణకు నియమించాలని విద్యుత్ శాఖ సిబ్బంది, బాధితులు సీఎండీకి విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.

# సామాన్యుడికి షాక్

విద్యుత్ చార్జీలు తగ్గిస్తాం తప్ప.. పెంచే ప్రసక్తే లేదు.. సోలార్ తెచ్చి వినియోగదారులే విద్యుత్ అమ్మేలా చేస్తామంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక షాకిచ్చారు. సర్దుబాటు పేరిట సామాన్యులపై భారం మోపుతూ చార్జీల పెంపును షురూ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ శుక్రవారం జిల్లావ్యాప్తంగా పోరుబాట నిర్వహించనుంది.

**వినియోగదారులకు సర్దుపోటు**

- విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదన్న చంద్రబాబునాయుడు
- ఇప్పుడు సర్దుబాటు పేరిట చార్జీల పెంపు
- జిల్లావాసులపై సుమారు రూ.13.98 కోట్ల భారం
- బిల్లులు చూసి షాకవుతున్న జనం
- నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట
- ప్రజలతో కలిసి చార్జీల తగ్గింపునకు డిమాండ్



సాక్షి, భీమవరం : ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్‌ను దూరం చేసిన కూటమి ప్రభుత్వం ఇతర వర్గాలపైనా పెనుభారం మోపే పనిలో పడింది. ఫ్యూయల్ పవర్ పర్చేజ్ కాస్టు ఎడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పీపీపీఏ)గా సర్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు పేరిట వినియోగాన్ని బట్టి రూ.150 నుంచి రూ.250 వరకు అదనపు బిల్లు వస్తున్నాయి. ప్రస్తుత, పాత సంవత్సరానికి సంబంధించి ఫిక్స్‌డ్, కస్టమర్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్ చార్జీలు సర్దుబాటుగా వినియోగించిన దానికన్నా దాదాపు రెట్టింపు మొత్తంతో బిల్లులు వస్తుండటంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. జిల్లాలో డొమెస్టిక్, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు 6,99,430 ఉండగా ఒక్కో బిల్లుపై సగటున రూ.200లు చొప్పున సుమారు రూ.13.98 కోట్ల అదనపు భారం పడుతున్నట్టు అంచనా. సాధారణంగా ఎండల తీవ్రత అధికంగా ఉండే ఏప్రిల్, మే, జూన్ నెలలతో పోలిస్తే చలి ప్రభావం ఎక్కువగా ఉండే నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది. ఇప్పుడే బిల్లులు మోత ఇలా ఉంటే ముందు ముందు ఇంకెంత పెరిగిపోతాయోనని వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.



**ఇది దగాకోరు ప్రభుత్వం**

చంద్రబాబు మరోసారి తన నైజాన్ని చూపించారు. ఎన్నికల ముందు ఒక్క పైసా కూడా పెంచమని చెప్పి ఇప్పుడు రూ.15,485 కోట్లు భారాన్ని ప్రజలపై మోపారు. ఇప్పటికే ఇంటి పన్నులు పెంచారు. జనవరి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి. సంపద సృష్టిస్తానని చెప్పి ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నారు. సంక్షేమాన్ని గాలి కొదిలేశారు. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజాపక్షమే. శుక్రవారం జరిగే కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని నిరసన తెలపాలి. – ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

**గత నెల కంటే పెరిగింది**



గత నెలలో రూ.300 విద్యుత్ బిల్లు రాగా ఈనెలలో రూ.483 బిల్లు వచ్చింది. చలిగాలులు వలన ఫ్యాన్ కూడా సరిగా వేసుకోలేదు. తగ్గాల్సింది పోయి రూ.183 బిల్లు పెరిగింది. ఇప్పుడే ఇలా ఉంటే వేసవిలో ఎంత పెరుగుతుందోనని భయమేస్తోంది. – కోనేటి హనుమంతరావు, మల్లవరం

**నిండా ముంచారు**



కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులను భారీగా పెంచింది. ప్రతి విద్యుత్ బిల్లుతో పాటు మరో రూ.100 వసూలు చేసి దోపిడీకి పాల్పడుతోంది. ఇది ప్రజలను నిండా ముంచడమే. నిలువునా మోసం చేసి దోచుకుంటున్న ప్రభుత్వంగా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – జి.ధనుంజయ, ఉండి

**ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి**



విద్యుత్ చార్జీలు పైసా కూడా పెంచమంటూనే ట్రూఅప్ పేరుతో పేదలపై భారం మోపుతున్నారు. ప్రతి కుటుంబానికీ రూ.500 నుంచి రూ.1,000 వరకు అదనపు భారం పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రూఅప్ చార్జీలు సత్వరం రద్దు చేయాలి. – పోతుమూడి రామచంద్రరావు, పోడూరు

### నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ పోరుబాట నిర్వహించనుంది. నియోజకవర్గ కేంద్రాల్లో ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి విద్యుత్ చార్జీలు పెంపునకు వ్యతిరేకంగా నిరసన తెలిపి విద్యుత్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తారు. పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు నేతృత్వంలో ఉదయం 10 గంటలకు భీమవరంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేస్తారు. తాడేపల్లిగూడెంలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, తణుకులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఉండిలో పార్టీ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు, పాలకొల్లులో పార్టీ ఇన్‌చార్జి గుడాల గోపి, భీమవరం, ఆచంట నియోజకవర్గాల్లో పార్టీ నేతల ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసనలు తెలపనున్నారు. అనంతరం చార్జీల తగ్గింపు కోరుతూ విద్యుత్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేయనున్నట్టు నాయకులు తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

**జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు.. వినియోగం (అక్టోబర్)**

| విభాగం | కనెక్షన్ల సంఖ్య | వినియోగం (మిలియన్ యూనిట్లు) |
|---|---|---|
| గృహావసరాలు | 6,18,238 | 77.67 |
| కమర్షియల్ | 81,192 | 17.86 |
| పరిశ్రమలు | 2,096 | 38.45 |
| స్థానిక సంస్థలు | 14,685 | 12.96 |
| వ్యవసాయం | 17,753 | 88.22 |

### నేడు ఎస్సీ వర్గీకరణ కమిషన్ పర్యటన

ఏలూరు(మెట్రో): షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై విచారణ చేయడానికి నియమించిన ఏకసభ్య కమిషన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం, ఉప కులాల సభ్యులు, సంఘాలతో సమావేశమై వినతి పత్రాలు స్వీకరిస్తారన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎస్సీ కులాలకు సంబంధించిన వ్యక్తులు, సంఘాలు, సంస్థల నుంచి మెమోరాండాలు స్వీకరించి ప్రభుత్వానికి నివేదిస్తారన్నారు. కమిషన్‌కు నివేదించే వ్యక్తులు ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. మెమోరాండం, వినతిపత్రాలు, పై రెండు అంశాలకు సంబంధించిన వాస్తవాలను తగు ధ్రువీకరణ పత్రాలతో మధ్యాహ్నం 2 గంటలలోపు సమర్పించాలన్నారు.

# మహిళలు రోడ్డెక్కినా ఎమ్మెల్యేకు పట్టదా?

- పశువధ కర్మాగారంతో తేతలిలో అవస్థలు
- నిరసన శిబిరానికి మాజీ మంత్రి కారుమూరి మద్దతు

తణుకు అర్బన్: దుర్వాసన, దుర్గంధం మధ్య బతకలేకపోతున్నాం, పశువధ కర్మాగారం మూసివేయాలంటూ తణుకు మండలం తేతలి గ్రామ మహిళలు రోడ్డెక్కినా స్థానిక ఎమ్మెల్యే నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించడం బాధాకరమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం తేతలిలో పశువధ నిర్వహిస్తున్న లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కర్మాగారం ముందు తేతలి గ్రామస్తులు, గోసేవా సమితి చేపట్టిన నిరసన దీక్షా శిబిరం వద్దకు వెళ్లి ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ రక్తపాతానికి సుభిక్షమైన తణుకు నియోజకవర్గంలో చోటు ఉండకూడదనే ఉద్దేశంతో, పశువధ కర్మాగారం నుంచి విముక్తి కలిగించే వరకూ బాధితులకు అండగా ఉంటానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ కర్మాగారం తెరుచుకోగానే ఉన్నతాధికారులతో మాట్లాడి ఒక్క పశువు తల కూడా తెగకుండా నిలిపివేశానని ఆ అధికారం, అవకాశం ఎమ్మెల్యేకు ఉంటుందన్నారు. అయితే ఇప్పుడు అక్రమంగా పశువధ జరుగుతున్నా తణుకు ఎమ్మెల్యే మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఎద్దేవా చేశారు. గ్రామంలో పిల్లలు అనారోగ్యాల బారిన పడుతున్నారంటూ మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటున్నా చలించకపోవడం దుర్మార్గమన్నారు. భవిష్యత్తులో అఖిలపక్షం తరపున అన్ని పార్టీలతో కలిసి తణుకులో శాంతి ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు.



శిబిరం వద్ద మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

**తణుకుకే అరిష్టం**

తణుకు గడ్డపై ఇంతటి రక్తపాతం జరగడం తణుకుకే అరిష్టమని, పశువధతో వెలువడుతున్న కాలుష్యం కారణంగా తాగునీరు, గాలి కలుషితమవుతాయన్నారు. కర్మాగారం సామర్థ్యం మేరకు రోజుకు 400 పశువులను వధిస్తే ఈ ప్రాంతమంతా దుర్వాసనతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ప్రజలంతా పిల్లాపాపలతో సుభిక్షంగా ఉండాలంటే రక్తపాతాన్ని అడ్డుకోవాల్సిందేనని అన్నారు. అనంతరం కారుమూరి వద్ద బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పశువధ కర్మాగారం వెనుక ఎవరు ఉన్నారో.. ఏం చేస్తున్నారో తమకు తెలుసని, వారిని నమ్మి మోసపోయామని ఘొల్లుమన్నారు. తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, కోట స్వామీజీల ఆధ్వర్యంలో నిరసన శిబిరం చేపట్టగా గోసేవా సమితి సభ్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్, జల్లూరి జగదీష్, కాకిలేటి రాజేంద్రప్రసాద్, గోసేవా సమితి సభ్యులు, తేతలి గ్రామస్తులు, జట్టు హమాలీలు పాల్గొన్నారు.

# క్రీడలు..వెలవెల

ఆడుదాం ఆంధ్రాతో 2024 క్రీడారంగానికి శుభారంభం పలికింది. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పోటీలు నిర్వహించి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడలను విస్మరించింది. క్రీడా పురస్కారాలను పక్కన పెట్టేసింది. ఇదిలా ఉండగా జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు.

**ఆరంభం అదుర్స్**

- ఆడుదాం ఆంధ్రాతో గత ప్రభుత్వం ప్రోత్సాహం
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన జిల్లా క్రీడాకారులు
- కూటమి ప్రభుత్వంలో క్రీడల ఊసెత్తని వైనం
- నిలిచిన క్రీడా పురస్కారాల ప్రదానం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆకివీడులో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీలు (ఫైల్)




సాక్షి, భీమవరం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జనవరిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలు పండుగ వాతావరణంలో జరిగాయి. పోటీల నిర్వహణకు ఏర్పాట్లు, క్రీడా సామగ్రిని ప్రభుత్వం సమకూర్చింది. జిల్లాలోని 535 సచివాలయాల పరిధిలో గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ స్థాయిల్లో జరిగిన పోటీల్లో సుమారు 70 వేల మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన 114 మంది క్రీడాకారులు విశాఖలో ఫిబ్రవరి 9 నుంచి జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటారు.

**క్రీడల ఊసెత్తని కూటమి**

క్రీడాకారులను ప్రోత్సహిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు గత ప్రభుత్వం క్రీడా పురస్కారాలు అందజేసింది. గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులకు పురస్కారాల రూపంలో రూ.97 లక్షల మేర ప్రోత్సాహంగా అందజేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక క్రీడలకు ప్రోత్సాహం కరువైంది. క్రీడా పురస్కారాల పంపిణీ నిలిచిపోయింది.

**సత్తాచాటిన క్రీడాకారులు**

- జనవరిలో జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజీఎట్ జూడో పోటీల్లో దొండపాటి సింహాద్రి (భీమవరం ఎస్ఆర్‌కేఆర్) స్వర్ణ పతకం సాధించాడు. ఫిబ్రవరిలో అమృతసర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు జేఎన్టీయూకే జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.
- రావాడ కుసుమ (వీరవాసరం) సీనియర్ ఓపెన్ నేషనల్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో లాంగ్ జంప్‌లో కాంస్యం సాధించింది.
- కర్రి కుమార్ రవితేజరెడ్డి (మార్టేరు) జేఎన్‌టీయూకే సెంట్రల్ స్పోర్ట్స్ మీట్ బాస్కెట్‌బాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. సౌత్ జోన్ పోటీలకు ఎంపికై జేఎన్‌టీయూకే జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు.
- దండి జ్యోతికశ్రీ (తణుకు) ఆగస్టులో ప్యారిస్‌లో జరిగిన ఒలింపిక్స్ పోటీల్లోని 4 ఇంటు 400 రిలే ఈవెంట్‌లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించింది.
- ఆంధ్రా యూనివర్సిటీ సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీల్లో బొడ్డు మహేష్ (భీమవరం మండలం గొల్లవానితిప్ప) రన్నరప్‌గా నిలిచాడు.
- సౌత్‌జోన్ ఆటల పోటీల్లోని ఎయిర్ పిస్టల్ రైఫిల్ షూటింగ్‌లో ఆర్‌సీ లాస్య (భీమవరం విష్ణు) విజేతగా నిలిచింది.
- 68వ స్కూల్‌గేమ్స్ ఏపీ స్టేట్ అంతర్ జిల్లా అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీల్లో కూండ్రపు నాగేంద్రసాయి (భీమవరం భాష్యం) రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.
- సకిలేటి కిషోర్ (పాలకొల్లు ఆదిత్య) యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయస్థాయిలో గుర్తింపు పొందాడు.
- నక్క సందీప్ (పెనుగొండ) యూత్ బాస్కెట్‌బాల్, జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో రాణించాడు.
- స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ నిర్వహించిన పోటీల్లో ఉమెన్ నేషనల్ ర్యాంకింగ్ విలువిద్య అండర్–17 జూనియర్ కేటగిరీ పోటీల్లో మాదాల సూర్యహంసిని (భీమవరం) మూడు బంగారు పతకాలు సాధించింది. టీమ్ ఈవెంట్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వేగేశ్న స్ఫూర్తి, మాదాల సూర్యహంసిని, కర్రి సుస్మిత, కామినేని రిషి కీర్తనలు బంగారు పతకం సాధించారు.
- మలేషియాలో డిసెంబర్‌లో జరిగిన మినిమ్ ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ టోర్నమెంట్‌లో మంతెన ధృతిసమీక్ష (భీమవరం) కాంస్య పతకం సాధించింది.
- భీమవరంలో ఇమ్మానియేల్ చిల్డ్రన్ హోమ్‌కు చెందిన విద్యార్థినులు బి.జేస్సీ, డి.ప్రియ, ఎన్.అశ్వినిలు కౌలాలంపూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటి పతకాలు సాధించారు.




ఫెన్సింగ్ పోటీల్లో సత్తాచాటిన ధృతిసమీక్ష




ఒలింపిక్స్‌లో పాల్గొన్న దండి జ్యోతిక శ్రీ

### సమగ్ర శిక్ష ఏపీసీ బాధ్యతల స్వీకరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా కురెళ్ల పంకజ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో గత జూన్ వరకూ పనిచేసిన సోమశేఖర్ పదవీ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఇప్పటివరకూ డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కైకలూరులోని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పంకజ్ కుమార్‌ను ఈ స్థానంలో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన పంకజ్ కుమార్‌ను ఆల్టర్నేటివ్ స్కూల్ కో–ఆర్డినేటర్ రాధాకృష్ణ, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి జె.రవీంద్ర, ఏఎస్ఓ రమేష్, సమగ్రశిక్ష జిల్లా కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



పంకజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

## క్లుప్తంగా

### శ్రీవారి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా త్రినాథరావు


ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాథరావు


ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా వేండ్ర త్రినాథరావును నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యన్నారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. త్రినాథరావు ద్వారకాతిరుమల దేవస్థానం ఈఓగా పనిచేస్తూ ఈ ఏడాది సెప్టెంబర్‌లో సింహాచలంకు బదిలీ అయ్యారు. అలాగే తిరుమల తిరుపతి దేవ స్థానం నుంచి ఎన్వీ సత్యన్నారాయణమూర్తి ద్వారకాతిరుమల దేవస్థానానికి ఈఓగా బదిలీపై వచ్చారు. అయితే సత్యన్నారాయణమూర్తి గుండె సంబంధిత చికిత్స నిమిత్తం నెలరోజుల పాటు సెలవు పెట్టడంతో, శ్రీవారి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా త్రినాథరావు నియమితులయ్యారు. ఆయన శుక్రవారం చార్జ్ తీసుకోనున్నారు.

### సీపీఐ నూతన కార్యాలయం కూల్చివేత


బుట్టాయగూడెంలో సీపీఐ కార్యాలయాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: స్థానిక గంగానమ్మ గుడి సమీపంలో సీపీఐ నిర్మించిన నూతన కార్యాలయాన్ని గురువారం సాయంత్రం పోలీసుల సమక్షంలో రెవెన్యూ అధికారులు జేసీబీతో కూల్చివేశారు. ఈ కూల్చివేతను ఆ పార్టీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. రెవెన్యూ భూమిలో అక్రమంగా నిర్మించిన కారణంగానే ఈ భవనాన్ని కూల్చివేసినట్లు తహసీల్దార్ పీవీ చలపతిరావు తెలిపారు. అలాగే పార్టీ కార్యాలయ భవన నిర్మాణ సమయంలో ఆ పార్టీ నాయకులు చోడెం దుర్గ, బేతి కిశోర్‌లపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును కూడా నమోదు చేశారు. కాగా కార్యాలయాన్ని శనివారం ప్రారంభించేందుకు ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేసుకోగా ఇంతలోనే ఈ పరిణామం చోటుచేసుకొంది.

### అమ్మవారికి 108 సువర్ణ పుష్పాల సమర్పణ


శంకరమఠంలో అందజేసిన 108 సువర్ణ పుష్పాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శంకర మఠం సర్వమంగళమ్మ అమ్మవారికి ఓ భక్తుడు బంగారు పుష్పాలు సమర్పించాడు. విజయవాడకు చెందిన దుర్గాప్రసాద్ రూ.2 లక్షలు విలువ గల 108 సువర్ణ పుష్పాలను గురువారం శంకరమఠంలో అందజేశారు. దుర్గాప్రసాద్‌కు శంకరమఠం అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు.

# ఆక్వాకు ఆక్సిజన్ గండం

- క్షణానికో రకంగా మారుతున్న వాతావరణం
- చేపలు, రొయ్యల చెరువుల్లో ప్రాణవాయువు సమస్య
- ఆందోళన చెందుతున్న ఆక్వా రైతులు


చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్లు

గణపవరం: క్షణానికో రకంగా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు ఆక్వా రైతులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. కొద్ది రోజులుగా వరుస తుపానులు, వాయుగుండం, వర్షాల కారణంగా వాతావరణం పూర్తిగా చల్లబడింది. దీంతో చేపలు, రొయ్యల చెరువుల్లో ప్రాణవాయువు సమస్య ఏర్పడి రైతులను కలవరపెడుతోంది. ఆక్వా చెర్వులలో ప్రాణవాయువు అందకపోవడం, పీహెచ్‌లో హెచ్చుతగ్గుదల కారణంగా చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. ముఖ్యంగా రొయ్యల చెరువుల్లో ఈసమస్య మరీ తీవ్రంగా ఉంది. తెల్లమచ్చవ్యాధి విజృంభణతో ఇప్పటి వరకూ తీవ్ర నష్టాలను చూసి పెట్టుబడి కూడా దక్కని రైతులకు ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఆనందంగా ఉన్నా రైతులను వాతావరణం ఉరుకులు పరుగులు పెట్టిస్తుంది.

**విపరీత ధోరణిలో వాతావరణం**

ఉదయం విపరీతమైన మంచు, తీవ్ర చలిగాలులు, మధ్యాహ్నం ఒకమోస్తరు ఎండ, సాయంత్రానికి వర్షం జల్లులు, విపరీతమైన ఉక్కబోత, అప్పటికప్పుడే చలి తీవ్రత పెరగడం వంటి వాతావరణ మార్పులు గత పది రోజులుగా ఆక్వా సాగుకు గండంగా పరిణమించాయి.

**ప్రాణవాయువు కోసం అదనపు ఖర్చు**

వాతావరణ మార్పులతో చెరవుల్లో ప్రాణవాయువు సమస్య తలెత్తుతుంది. దీనితో చెరువుల్లో ఆక్సిజన్ లోటు పూడ్చడానికి రైతులకు అదనపు వ్యయం తప్పడంలేదు. చెరువుల్లో నిరంతరం ఏరియేటర్లు తిప్పవలసి రావడం, ఇంజన్లతో నీటిని రీసైక్లింగ్ చేయడం, ఆక్సిజన్ పెరగడానికి రసాయనాల వినియోగం, పీహెచ్ కోసం లైమ్ వాడటం, రోజూ నీటి సాంద్రతలు పరీక్షించడం వంటి కారణాల వలన పెట్టుబడి రెట్టింపయ్యిందని రైతులు వాపోతున్నారు. ఇన్ని చేసినా రొయ్యలు కౌంట్‌కు రాకుండానే పట్టివేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని, దీనివల్ల పెట్టుబడి మాట అటుంచి కనీసం చెర్వుల లీజు ధరకూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కనీసం అరకిలో సైజుకు రాకుండానే చేపలు మృత్యువాత పడటం వల్ల నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. చేప పిల్లల పెంపకం చేస్తున్న రైతులకు ప్రస్తుత వాతావరణ మార్పులు మరీ ఇబ్బందికరంగా ఉన్నాయని వాపోతున్నారు.


కౌంట్‌కు రాకుండానే పట్టివేసిన రొయ్యలు


చనిపోయిన చేపలను ఒడ్డుకు తెచ్చిన దృశ్యం

**ఉమ్మడి జిల్లాలో ఆక్వా సాగు వివరాలు**

| | |
|---|---|
| మొత్తం ఆక్వా సాగు | : 2.80 లక్షల ఎకరాలు |
| చేపల సాగు | : 1.90 లక్షల ఎకరాలు |
| రొయ్యల సాగు | : 90 వేల ఎకరాలు |
| గత రెండు వారాలలో ఆక్సిజన్ సమస్యతో ఖాళీఅయిన చెరువులు | : సుమారు 20 వేల ఎకరాలు |

**సూచనలు పాటించాలి**

ఆక్సిజన్ సమస్య అధిగమించడానికి చెరువుల్లో నిరంతరం ఏరియేటర్లు తిప్పుతూ ఉండాలి. నాణ్యమైన సీడ్ వలన వైరస్ సమస్యలు తొలగిపోతాయి. వాతావరణానికి అనుగుణంగా మేతలు, ప్రోబయోటిక్స్ వాడాలి. మూడు గంటలకోసారి పీహెచ్, ఆక్సిజన్ స్థాయిలు సరిచూసుకోవాలని గణపవరం ఎఫ్‌డీవో శివరామకృష్ణయ్య సూచించారు.

# అల్లూరి స్మృతివనంను మరింత అభివృద్ధి పరచాలి

**'ఆజాదికా అమృత్' సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ ఉమా నందూరి**


భీమవరంలో అల్లూరి స్మృతి వనం అభివృద్ధి పనులను పరిశీలించిన ఉమా నందూరి

భీమవరం(ప్రకాశం చౌక్): అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రాంగణాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా అభివృద్ధి పరిచేందుకు వేగవంతమైన చర్యలు చేపట్టాలని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అజాదికా అమృత్ మహోత్సవం సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ ఉమా నందూరి అన్నారు. భీమవరంలో కేంద్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన అల్లూరి స్మృతి వనం అభివృద్ధి పనులను గురువారం ఆమె కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమా నందూరి మాట్లాడుతూ స్ఫూర్తి వనంలో పచ్చదనంతో పాటు, అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్ర, శనివారాల్లో విజయనగరం జిల్లా పాండ్రంగిలో అల్లూరి సీతారామరాజు తల్లిదండ్రుల ఇంటి పునరుద్ధరణ, చింతపల్లిలో అల్లూరి సీతారామరాజు జైలులో ఉన్న పోలీస్ స్టేషన్ పునరుద్ధరణ పనులను తనిఖీ చేయనున్నట్లు ఆమె చెప్పారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారీ విగ్రహాన్ని భీమవరంలో ఏర్పాటు చేసుకోవడం ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి స్మృతి వనం ప్రాంతాన్ని మరింత సుందరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంలో ఆనందగ్రూపు చైర్మన్ విశ్వనాథరాజు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు, గాదిరాజు సుబ్బరాజు, సీహెచ్ కృష్ణంరాజు, నాని రాజు, డాక్టర్ రఘురామరాజు, సీహెచ్ ఝాన్సీలక్ష్మి, భీమవరం ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, తదితరులు ఉన్నారు.

## ఆరోగ్య సహాయకుల తొలగింపు దారుణం


కన్వీనర్ ప్రసాద్

ద్వారకాతిరుమల: వైద్య ఆరోగ్య శాఖలో వేలాది మంది ఆరోగ్య సహాయకులను తొలగించి 20 రోజులు గడుస్తున్నా, కూటమి ప్రభుత్వం దానిపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రసాద్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కోర్టు తీర్పు పేరుతో ఒక్కసారిగా ఇంత మంది ఉద్యోగులను తొలగించడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఇప్పటికే ఉద్యోగాలు కోల్పోవడంతో ఆవేదనకు గురై ముగ్గురు గుండెపోటుతో మరణించినట్లు చెప్పారు. కోర్టు ఉత్తర్వులకు లోబడి మెరిట్ ఆధారంగా, సేంక్షన్ పోస్టులను తిరిగి ఉద్యోగులకు త్వరితగతిన ఇవ్వాలని కోరారు. బాధితులకు మనోధైర్యం కల్పించాలని ఆ శ్రీవారిని వేడుకున్నట్టు ప్రసాద్ తెలిపారు.

# కొల్లేరు అక్రమ చెరువులు కొట్టివేత


ఏలూరు రూరల్ మండలం అభయారణ్యంలో చెరువు గండి కొడుతున్న దృశ్యం

- పచ్చనేతలతో అటవీశాఖ లాలూచీ
- తూతూమంత్రంగా చెరువు గట్లు కొట్టివేత

ఏలూరు రూరల్: కొల్లేరులో అటవీశాఖ అధికారులు అక్రమ చెరువులు కొట్టివేత చేపట్టారు. ఏలూరు డివిజన్ రేంజ్ ఆఫీసర్ సోమరాజు ఆధ్వర్యంలో సిబ్బంది కొద్దిరోజులుగా చెరువులు కొడుతున్నారు. ఇప్పటికే ఏలూరు రూరల్ మండలంలోని కొక్కిరాయిలంక, పెదయాగనమిల్లి, మాధవాపురం, లింగారావుగూడెంలో 4 చెరువులు కొట్టారు. కొద్దిరోజుల క్రితం అటవీశాఖ సీసీఎఫ్ క్షేత్రస్థాయిలో పర్యటించి అభయారణ్యంలో తవ్విన చెరువులు గుర్తించారు. ఈ చెరువులకు గండ్లు కొట్టి, నివేదిక అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు గుట్టుచప్పుడు కాకుండా చెరువులు కొట్టే పనిలో పడ్డారు. దీనిపై డీఆర్వో సోమరాజును వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అభయారణ్యంలో అక్రమ చెరువులపై తీసుకున్న చర్యలు గురించి వెల్లడించలేమన్నారు.

**పచ్చనేతలతో లాలూచీ**

చెరువు గట్లు కొట్టే క్రమంలో అటవీ అధికారులు పచ్చనేతలతో లాలూచీ పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గండ్లు కొట్టే ముందు ఆ శాఖ సిబ్బంది అక్రమార్కులకు సమాచారం అందిస్తున్నారని తెలిసింది. చేపలు బయటకు పోకుండా వలలు కట్టుకోవాలని సూచిస్తున్నారని వినికిడి. ఇదే క్రమంలో ఏలూరు మండల టీడీపీ పూర్వ అధ్యక్షుడు లింగారావుగూడెం పరిసర అభయారణ్యంలో తవ్విన చెరువుకు అధికారులు తూతూ మంత్రంగానే గండి పెట్టి వెళ్లిపోయారు. 20 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువుకు కేవలం 5 మీటర్ల గండి కొట్టడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. కొక్కిరాయిలంక పరిసరాల్లో తవ్విన సుమారు 90 ఎకరాల చెరువుకు సైతం చిన్నపాటి గండి కొట్టారు. దీంతో అధికారులు ముందుగానే అక్రమార్కులతో చేతులు కలిపారని ప్రజలు భావిస్తున్నారు. తూతూమంత్రంగా గండ్లు కొట్టేలా చూసుకుంటూ అధికారులకు ముడుపులు మూటకడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ఎవరి రోడ్డు వారే బాగుచేసుకోవాలి!

- రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టని కూటమి ప్రభుత్వం
- గత్యంతరం లేక మరమ్మతులకు పూనుకున్న ప్రజలు


పోలీసుకాలనీ ఎగువ ప్రాంతంలో రోడ్డుపై పడ్డ గోతుల్లో వేస్ట్ మెటీరియల్ వేసిన దృశ్యం


వర్షాకాలంలో బురదమయంగా పోలీస్‌కాలనీ పరిసర రోడ్డు (ఫైల్)

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వ పాలన.. ప్రజల సమస్యలను వారే తీర్చుకోవాలి అన్నట్టు సాగుతోంది. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడుస్తున్నా రోడ్ల అభివృద్ధి పనులు నేటికీ పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. డిసెంబర్‌లో పనులు ప్రారంభిస్తాం అంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇక చేసేది లేక నివాసితులు డబ్బులు పోగు చేసుకుని ఇళ్ల ముందు ఉన్న రోడ్లకు మరమ్మతులు చేసుకుంటున్నారు. స్థానిక 18వ డివిజన్ పరిధిలో జర్నలిస్ట్ కాలనీ నుంచి పోలీసుకాలనీ వెళ్లే దారి అధ్వాన్నంగా మారింది. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరీ దారుణం. ద్విచక్ర వాహనచోదకులు, ఆటోలు, స్కూల్ వ్యాన్లలో పిల్లలు, వృద్ధులు పయనించేందుకు నానా అవస్థలు పడ్డారు. రోడ్డు బాగు చేయాలంటూ పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నారు. కొద్దిరోజుల క్రితం అధికారులు పోలీసుకాలనీ వద్ద రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో స్థానికులు సంబరపడ్డారు. చాలా కాలానికి రోడ్డు అభివృద్ధి జరుగుతోందనుకున్నారు. తీరా చూస్తే అధికారులు పోలీస్‌కాలనీ పరిసరాల్లో సుమారు 100 మీటర్ల మేరకు రోడ్డు మాత్రమే అభివృద్ధి చేసి, మిగిలిన రోడ్డును వదిలేశారు. దీంతో ఎగువ ప్రాంతంలో నివాసితులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత్యంతరం లేక స్థానికులు కొందరు డబ్బులు వేసుకుని జ్యూట్‌మిల్లు నుంచి వేస్ట్ మెటీరియల్, మట్టి టిప్పర్ల ద్వారా తరలించి రోడ్డును చదును చేయిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని వేడుకుంటున్నారు.

**ఇంటికి ఆటో రావడం లేదు**

ఈ ప్రాంతంలో ఇంటికి ఆటో రావడం లేదు. రోడ్డుపై పడ్డ గోతుల వల్ల డ్రైవర్లు జంకుతున్నారు. బైక్‌పై వృద్ధులు, వికలాంగులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటేనే భయమేస్తోంది. రోజుకు ఒక వాహనం ఆగిపోతోంది. నాయకులు, అధికారులు స్పందించి మా ఇంటి పరిసరాల్లో రోడ్డు బాగు చేయాలని కోరుతున్నాం.

– ఎస్.మోహనరావు, స్థానికుడు

**చినుకు పడితే నడవలేం**

వర్షం పడితే ఈ రోడ్డుపై నడవలేం. పెద్ద పెద్ద గోతులు, రాళ్లు కారణంగా సైకిల్, స్కూటర్ ఏదైనా పడిపోవాల్సిందే. రాత్రివేళల్లో కొత్త వాళ్లు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో చాలా మంది నివాసం ఉంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధి చేయాలి.

– బి శ్రావణి, స్థానికురాలు

**వాహనాలు దెబ్బతింటున్నాయి**

కొద్దిరోజుల క్రితం రోడ్డులో కొంతభాగం బాగుచేశారు. మా ఇళ్ల వద్దకు వచ్చేసరికి వదిలేశారు. మా ఇళ్ల వద్ద కూడా రోడ్డు బాగుచేయాలని కోరుకుంటున్నాం. రోడ్డుపై పడ్డ గోతుల్లో నుంచి వెళ్లడం వలన వాహనాలు దెబ్బతింటున్నాయి. వ్యాన్ డ్రైవర్లు సైతం ఈ రోడ్డుపై రావాలంటేనే జంకుతున్నారు.

– కె.రామారావు, స్థానికుడు



# నకిలీ కరెన్సీ అంటూ.. టాయ్ నోట్లు ఇచ్చి మోసం

- పోలీసుల అదుపులో ఒక యువకుడు, పరారీలో మరో యువకుడు
- ఒరిజినల్ కరెన్సీ రూ. 2.50 లక్షలు..
- టాయ్ కరెన్సీ రూ. 15 లక్షలు స్వాధీనం

ద్వారకాతిరుమల: ఒరిజినల్ కరెన్సీ నోట్లు ఇస్తే.. నకిలీ కరెన్సీని అధికంగా ఇస్తామని ఒక వ్యాపారిని నమ్మించి, చివరకు బొమ్మ (టాయ్) కరెన్సీ ఇచ్చి మోసగించబోయిన ఇద్దరిలో, ఒక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో యువకుడు పరారయ్యాడు. ద్వారకాతిరుమలలో గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటన సంచలనాన్ని రేకెత్తించింది. స్థానికుల కథనం ప్రకారం. గ్రామానికి చెందిన సుభాష్ అనే వ్యాపారితో, జంగారెడ్డిగూడెంకు చెందిన ఇద్దరు యువకులు పరిచయం పెంచుకున్నారు. అతడి ఆర్థిక అవసరాలను గమనించిన యువకులు ఒరిజినల్ కరెన్సీ రూ. 2.50 లక్షలు ఇస్తే, నకిలీ కరెన్సీ రూ.15 లక్షలు ఇస్తామని నమ్మబలికారు. ఒప్పందం ప్రకారం ఆ యువకులు స్థానిక యాదవ కాలనీ వద్దకు రాగా, అక్కడ సుభాష్ వారికి ఒరిజినల్ కరెన్సీని ఇచ్చి, వారిచ్చిన బ్యాగ్‌ను తీసుకున్నాడు. అనంతరం బ్యాగ్ తెరచి చూడగా నకిలీ కరెన్సీ నోట్లకు బదులుగా, బొమ్మ కరెన్సీ నోట్లు కనిపించాయి. దాంతో కంగుతిన్న సుభాష్ తాను ఇచ్చిన నగదును వారి నుంచి లాక్కున్నాడు. ఆ సమయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో సుభాష్ తన నగదును తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అలాగే బొమ్మ కరెన్సీ తెచ్చిన ఇద్దరిలో ఒక యువకుడు పరారయ్యాడు. కాగా మిగిలిన యువకుడిని స్థానికులు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై టి.సుధీర్ సదరు యువకుడితో పాటు, సుభాష్‌ను విచారిస్తున్నారు. టాయ్ నోట్లు ఇచ్చిన యువకులు ఇద్దరేనా.. లేక ఏదైనా ముఠా ఉందా, అలాగే వారు టాయ్ కరెన్సీ ఇచ్చేవారేనా.. లేక నకిలీ నోట్లు కూడా చలామణి చేసేవారా అన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

## అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

భీమవరం: అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి. వై కిరణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన సీహెచ్ మధుబాబు (36)కు నర్సయ్య అగ్రహారానికి చెందిన విజయతో పదేళ్ల క్రితం వివాహమైంది. ఏడేళ్లుగా మధుబాబు అత్తారింటి దగ్గర ఉంటున్నాడు. గురువారం ఉదయం మధుబాబుకు అనారోగ్యంగా ఉందని కోడలు ఫోన్ చేసి చెప్పడంతో 108 ద్వారా భీమవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని మృతుడి తండ్రి శ్రీనివాస్ తెలిపారు. తన కుమారుడు మృతిపై అనుమానం ఉందని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

## నిద్రిస్తున్న వ్యక్తిపై టిప్పర్ లారీ ఎక్కి..


ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో చర్చిస్తున్న సీఐ రవీంద్ర నాయక్

చింతలపూడి: లారీని బ్యాక్ చేస్తుండగా నిద్రిస్తున్న వ్యక్తిపైకి ఎక్కడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చింతలపూడి మండలం వెంకటాద్రిగూడెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాగ శ్రీనివాసరావు(50) స్థానికంగా రహదారి నిర్మాణ సంస్థలో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి యథావిధిగా విధుల్లో పాల్గొని అక్కడే నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో మట్టి పోయడానికి వచ్చిన టిప్పర్ లారీ బ్యాక్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ అక్కడే నిద్రిస్తున్న శ్రీనివాసరావుపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసరావుకు భార్య, కుమార్తె ఉన్నారు. దీంతో అతడి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గురువారం చింతలపూడి జీబీజీ రోడ్డుపై మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ రవీంద్ర నాయక్, ఎస్సై కుటుంబరావు బాధిత కుటుంబంతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### నేడు రంగస్థల కళాకారుల సంఘ సభ

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 151వ నెలవారీ సభా కార్యక్రమం ఈ నెల 27వ తేదీన స్థానిక గీతా మందిరంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు నూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీ కృష్ణ, కోశాధికారి మాస బాబూరావులు వెల్లడించారు. సభలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పద్మనాభుని మురళీకి సత్కారం, సినీ నటుడు మేడిచర్ల సత్యనారాయణ మూర్తి (మొయ్యేరు), పరిమెళ్ల పంచాయతీ కార్యదర్శి దేవబత్తుల నాగదేవిలకు సేవా పురస్కారాలు, సీనియర్ రంగస్థల నటుడు జోశ్యుల కేశవ రావుకు ఆర్థిక సత్కారాలు జరుగుతాయని, సంగీత విభావరి, హాస్య వల్లరి, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పట్టణ ప్రముఖులు హాజరవుతారని, సభను జయప్రదం చేయాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** టూ టౌన్‌లోని సౌత్ కొబ్బరితోట ఫీడర్ పరిధిలో ఈ నెల 27వ తేదీ శుక్రవారం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. ఫీడర్ పరిధిలో యాగర్లపల్లి, సీతారామపేట, ఏలూరు రోడ్డు, కొబ్బరితోట పరిసర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా జరగదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### 29 నుంచి ఈపీఎఫ్ సంవత్సరాంత సభలు

**పెంటపాడు:** ఈనెల 29 నుంచి 31 వరకు తణుకు ఇమ్మానియేలు ప్రేయర్ ఫెలోషిప్ (ఈపీఎఫ్) చర్చిలో సంవత్సరాంతపు సభలు నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు పరస మోజెస్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించబోయే ఈ సభలలో సంవత్సరం అంతా కాపాడి, రక్షించిన దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తూ ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు ఉంటాయన్నారు. విశ్వాసులు తప్పక పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

**29న స్త్రీల క్రిస్మస్ వేడుకలు**

29న గూడెం టౌన్ ఎ.క్లాష్ ప్యారిష్ సెంటినరీ చర్చిలో యూత్, స్త్రీల క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు సంఘ గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫీనెహాస్, పాలకవర్గ అధ్యక్షుడు ఎం. బాస్కరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకించి స్త్రీలు, యూత్ సంఘ సభ్యులు ఈ వేడుకలు నిర్వహిస్తారన్నారు. సంఘ సభ్యులు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక బోధన అందిస్తున్నాం



భవిత సెంటర్‌లో దివ్యాంగులకు విద్యను అందజేస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** దివ్యాంగుల పిల్లలకు నార్మల్ పిల్లలతో సమానంగా డిజిటల్ విద్యను అందజేస్తున్నామని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య వెల్లడించారు. భవిత సెంటర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు రీడింగ్ స్కిల్స్, నెంబర్ కాన్సెప్ట్, వివిధ రకాల పండ్లు పేర్లు, అల్ఫాబెట్స్, వాహనములపై పేర్లు, రంగుల పేర్లు, జంతువుల పేర్లు, సోషల్ స్కిల్స్, మనీ కాన్సెప్ట్, రైమ్స్ తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ట్యాబ్, ప్రత్యేక బోధన మెటీరియల్ ఉంటుందని, ప్రత్యేక యాప్స్ జల్లో యాప్, కవి పీటీఎస్ యాప్ ఉపయోగించి పిల్లల్లో నైపుణ్యాలు అభివృద్ధికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పిల్లలకు యోగా, ధ్యానం అందిస్తున్నట్లు చెప్పారు. పిల్లలకు శిక్షణతో పాటుగా తల్లిదండ్రులకు ఇంటి వద్ద నేర్పించాల్సిన నైపుణ్యాలపై భవిత కేంద్రంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో దివ్యాంగుల పిల్లలకు కల్పిస్తున్న అన్ని రకాల సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శించిన 'వడ్డి'



పెంటపాడులో కొవ్వూరి భాస్కరరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వడ్డి రఘురాంనాయుడు

**పెంటపాడు:** మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు వడ్డి రఘురాంనాయుడు గురువారం పరామర్శించారు.

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని బంగారుగూడెం గ్రామానికి చెందిన ముప్పిడి వెంకట్రామిరెడ్డి తండ్రి కిట్టయ్య ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాంనాయుడు పరామర్శించారు.

# బాదుడే బాదుడు!

- భారీగా విద్యుత్ చార్జీల పెంపు
- మాటతప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- లబోదిబోమంటున్న ప్రజలు



గూడెం విద్యుత్ డివిజన్ కార్యాలయం

**తాడేపల్లిగూడెం:** విద్యుత్ చార్జీల మోతే ఉండదు. కరెంటు చార్జీలు పెంచబోము. బాదుడే బాదుడే ఉండదు. అని సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు హామీలు గుప్పించారు. కూటమి పాలనా పగ్గాలు చేపట్టి ఆరు నెలలైనా కాలేదు. దొడ్డిదారి బాదుళ్లు ప్రారంభమయ్యాయి. సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులకు కరెంటు షాక్ ఇచ్చారు. వ్యాపార ప్రకటనల కరపత్రాలపై కనిపించి కనిపించని విధంగా నిబంధనలు వర్తిస్తాయి. అన్న విధంగా నవంబరు, డిసెంబరు నెలలు విద్యుత్ బిల్లులు పోల్చుకుంటే డిసెంబరు బిల్లు తగ్గినట్టుగా కనపడుతోంది. నవంబరు నెలతో పోలిస్తే, నవంబరు ఆఖరి వారం నుంచి శీతాకాలం ప్రారంభం కావడంతో ఏసీల వినియోగం పూర్తిగా తగ్గిపోయింది. దోమల బాధ పడలేక మాత్రం ఫ్యాన్‌లు తిరుగుతున్నాయి. దీంతో నెల నెలా వినియోగించే విద్యుత్ బిల్లుల యూనిట్లు కనీసం 20 నుంచి 30 యూనిట్ల వరకు తగ్గాయి. కాని ఈ మేరకు బిల్లులో తగ్గుదల కనిపించలేదు. కాస్త తక్కువగా మాత్రం బిల్లు వచ్చింది. 16 వందల నుంచి 18 వందల వరకు వచ్చే విద్యుత్ బిల్లులో సర్దుబాటు చార్జీల మోత 300 రూపాయల వరకు ఉంది. తొమ్మిది వందల రూపాయల నుంచి వెయ్యి రూపాయల వరకు వచ్చే కరెంటు బిల్లుకు సర్దుబాటు చార్జీల భారం రూ.271ల వరకు పడింది. దీంతో డిసెంబర్ బిల్లులు అందుకున్న విద్యుత్ వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. కరెంటు షాక్‌కు విలవిల్లాడుతున్నారు.

**నియోజకవర్గ ప్రజలపై రూ.30 కోట్ల భారం**

వినియోగించిన విద్యుత్‌తో పాటు విధించే ఫిక్స్‌డ్ చార్జీ, కస్టమర్ చార్జీ, ఈడీ, సర్‌చార్జీ , ఈడీ ఐఎస్‌టీ చార్జీలు కాకుండా ఒక్క ఎఫ్‌పీపీసీఏ చార్జీల కింద గూడెం నియోజకవర్గ విద్యుత్ వినియోగదారులపై సుమారు డిసెంబర్ నెలలో సుమారు రూ.30 కోట్ల భారం పడింది. నియోజకవర్గంలో 99,531 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిపై 29 కోట్ల 85 లక్షల తొమ్మిదివేల 300 రూపాయల భారం పడింది. ఒక్క బిల్లుపై సరాసరి ఎఫ్‌పీపీసీఏ చార్జీల కింద కనెక్షన్‌కు రూ.300 రూపాయల వంతున చూసుకుంటే వినియోగదారులపై ఈ భారం పడింది.

## పేదలకు షాకిస్తున్న విద్యుత్ బిల్లులు

**తణుకు అర్బన్:** సంక్షేమం లేక తల్లడిల్లుతున్న పేద ప్రజానీకానికి విద్యుత్ శాఖ అందిస్తున్న విద్యుత్ బిల్లులు షాకిస్తున్నాయి. రోజురోజుకీ చలి పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ వాడకం భారీగా తగ్గుతుందనుకుంటున్న పేదలు తాజా విద్యుత్ బిల్లులు చూసి గగ్గోలు పెడుతున్నారు. గతంలో నెలకు రెండు నుంచి మూడు వందలు బిల్లు వచ్చిన వారు సైతం ఈ డిసెంబరు నెల బిల్లు అమాంతం పెరిగిపోయిందంటూ బెంబేలెత్తిపోతున్నారు. ఖాళీగా ఉన్న ఇళ్లకు సైతం కనీస బిల్లులో సర్దుబాటు చార్జీలను కలుపుతుండడంతో రూ.200లకు పైబడి బిల్లు వచ్చిందంటూ వాపోతున్నారు.



తణుకులో విద్యుత్ సబ్‌స్టేషన్

### మాట మార్చిన కూటమి ప్రభుత్వం



ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇచ్చిన మాటను తప్పడం అతనే సాటి అని నిరూపించుకున్నారు. ఐదేళ్ల క్రితం వినియోగించిన విద్యుత్ చార్జీలకు అప్పుడే బిల్లులు చెల్లించాం. మళ్లీ చెల్లించిన బిల్లులకు మళ్లీ విద్యుత్ చార్జీలు ప్రజలపై మోపడం దారుణం. తన 45ఏళ్ల రాజకీయ అనుభవాన్ని ప్రజలను మోసం చేయడానికే మాత్రమే చంద్రబాబు అనుభవం సంపాదించారు.

– నీలగిరి అనూరాధ, హౌసింగ్‌బోర్డు, తాడేపల్లిగూడెం.

### పునరాలోచన చేయాలి



ఇచ్చిన హామీని అమలు చేయకుండా ప్రజలను వంచనకు గురిచేయంలో చంద్రబాబు గురువు. చంద్రబాబు రాజకీయల నుంచి వైదొలగితే మంచిది. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అధిక ఆర్థిక భారం మోపాడు. మాట తప్పితే ప్రశ్నిస్తానన్న పవన్‌కల్యాణ్ ఎక్కడా కనబడటంలేదు.

– తాడిపర్తి రజని, హౌసింగ్‌బోర్డు, తాడేపల్లిగూడెం.

### సామాన్యులు బతకడం కష్టం



కూటమి ప్రభుత్వ పాలనలో సామాన్య ప్రజలు బతకడం కష్టతరంగా మారింది. నిత్యావసర సరుకులు భారీగా ధరలు పెరిగాయని గగ్గోలు పెడుతుంతే చంద్రబాబునాయుడు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేసి సామాన్యుడి జీవనాన్ని మరింత అధోగతి పాలు చేశాడు. ఇచిన మాట నెరవేర్చడంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి.

– కారింకి వీర్రాజు, పెదతాడేపల్లి

### క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పెంటపాడు:** నూతన సంవత్సరంకు సంబంధించి క్యాలెండర్‌ను పాస్టర్ మోజస్ ప్రవీణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత, నూతన సంవత్సరాల మధ్య వారధిగా క్రీస్తు ప్రభువును విశ్వాసలు తమ హృదయంలో ప్రతిష్ఠించుకోవాలన్నారు. గత సంవత్సర కాలంలో కాపాడిన క్రీస్తు ప్రభువుకు కృతజ్ఞతలు చెల్లిస్తూ రాబోయే నూతన సంవత్సరంలో ప్రజలందరిపై దేవుని కృప ఉండేలా తప్పక ప్రార్థనలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవకురాలు పి.అరుణ కుమారి, ప్రేజీ, విశ్వాసులు పాల్గొన్నారు.

### లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేస్తాం



లయన్స్‌క్లబ్ ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీవీఎన్ లక్ష్మీనారాయణ వెల్లడించారు. క్లబ్ సేవా కార్యక్రమాలలో భాగంగా పాస్ట్ ప్రెసిడెంట్స్‌ను సత్కరించారు. పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ పీవీ సత్యనారాయణ, జోన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్, పాస్ట్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, పీఎంజేఎఫ్ లయన్ పదం కుమార్ గుప్తా, కార్యదర్శి చిన్నం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పశువధపై పోరాటానికి అండగా నిలబడతాం

రామరాజ్యం వ్యవస్థాపకుడు వీరరాఘవరెడ్డి



తేతలిలో నిరసన శిబిరం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న రామరాజ్యం వ్యవస్థాపకుడు వీరరాఘవరెడ్డి, గోసేవా సమితి సభ్యులు

**తణుకు అర్బన్ :** పశువధ కర్మాగారం మూసేవరకు తేతలి గ్రామస్తులకు అండగా నిలబడి పోరాటాన్ని ఉధృతం చేస్తామని రామరాజ్యం వ్యవస్థాపకుడు కొవ్వూరి వీరరాఘవరెడ్డి తెలిపారు. తణుకు మండలం తేతలి పరిధిలోని లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ పశు వధశాల ముందు గురువారం గ్రామస్తులు నిరసన శిబిరం నిర్వహించారు. ఈ ఆందోళనలో పాల్గొన్న వీరరాఘవరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ ఉదయం పశు వధశాల నుంచి బయటకు వచ్చిన పశు వ్యర్థాల వాహనాన్ని పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేయమంటే తాత్సారం చేశారన్నారు. ఎట్టకేలకు కేసునమోదు చేశామని చెప్పి, ఉదయాన్నే ఎఫ్ఐఆర్ కాపీ తీసుకువెళ్లాల్సిందిగా చెప్పిన తణుకు రూరల్ పోలీసు అధికారులు దొడ్డిదారిన వాహనాన్ని వదిలేసి కేసు నమోదు చేయకపోవడాన్ని న్యాయస్థానంలో ఎదుర్కొంటామన్నారు. ఇందులో జిల్లా ఎస్పీతో సహా తణుకు పోలీసు అధికారులపై కూడా చట్ట ప్రకారం బాధ్యులుగా చేసి న్యాయస్థానం ముందు కూర్చోపెడతామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ సైతం పట్టించుకోలేదని, తణుకు రూరల్ పోలీసు అధికారులు అందరూ బాధ్యతలను విస్మరించి విధులు నిర్వర్తిస్తున్నారని అందరిపైనా చట్ట ప్రకారం పోరాడతామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తణుకులో ఘెరావోలు, అఘోరాలు, నాగ సాధువులతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అఘోరా అఖాడా జాతీయ ఉపాధ్యక్షుడు రాజేష్‌నాథ్‌జీ అఘోరీ మాట్లాడుతూ పశు వధశాలను మూసివేసేంత వరకు గ్రామస్తులకు తోడుగా పోరాడేందుకు అఘోరా అఖాడా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, సోదరుడు కోట స్వామీజీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన శిబిరంలో తేతలి గ్రామస్తులతోపాటు చివటం, తణుకు సజ్జాపురం, మహాలక్ష్మినగర్ ప్రాంత వాసులు శిబిరంలో కూర్చున్నారు. మహిళలు వంటవార్పు నిర్వహించారు. సేవ్ తేతలి, సేవ్ తణుకు నినాదాలతో పశువధ శాల ప్రాంతాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో గోసేవా సమితి సభ్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్, పోలిశెట్టి బాలాజీ, పసుపులేటి సూరిపండు, తేతలి గ్రామస్తులు పాల్గొన్నారు.

## సోలార్ పవర్‌పై అవగాహన అవసరం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** సాంప్రదాయ ఇంధన వనరులు ద్వారా వచ్చే విద్యుత్‌ను ఆదా చేసేందుకు ప్రజలు తప్పక ప్రత్యామ్నాయమైన సోలార్ పవర్‌పై దృష్టి సారించాలని ఏపీఈపీడీసీఎల్ రూరల్ డిప్యూటీ ఈఈ రామకృష్ణ వెల్లడించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం అధ్యక్షుడే వీవీఎన్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శశి కళాశాల రోడ్డులోని లయన్స్‌క్లబ్ భవనంలో గురువారం సోలార్ పవర్‌పై డెమో ప్రజెంటేషన్ నిర్వహించారు. ముగ్గురు వెండార్స్‌తో హాజరై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు, సోలార్ పరికరాలు ప్రదర్శన ఏర్పాటు చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ ఇంధన వనరులు తగ్గిపోతున్న నేపథ్యంలో రానున్న రోజులలో సోలార్ కీలకభూమిగా మారుతుందన్నారు.



సోలార్ పవర్ ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

సెంట్రల్ గవర్నమెంట్ ఇచ్చే సబ్సిడీ ఎంతో ఉపయుక్తమని చెప్పారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ ఏఈ లీలావతి, జీఎంఆర్ కళాశాల విద్యార్థులు, పట్టణ వాసులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## కరెంటు చార్జీల పెంపుపై నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

**తణుకు అర్బన్:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీల బాదుడుపై తణుకులో వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. తణుకు కప్పల వెంకన్న సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి వేల్పూరు రోడ్డు భాష్యం స్కూలు ప్రాంతంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్దకు చేరుకుని విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందచేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

## క్రీస్తు సందేశం..శాంతికి మార్గం

**పెంటపాడు:** క్రిస్మస్ సంబరాలు గురువారం కూడా గూడెం పట్టణంలో కొనసాగాయి. ఈ సందర్భంగా సెంటినరీ లూథరన్ చర్చిలో గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫీనేహాస్ ఆధ్వర్యంలో గురువారం కూడా క్రిస్మస్ వేడకలు జరిగాయి. హౌసింగ్ బోర్డు కరెంట్ ఆఫీస్ సమీపంలో ఏసుక్రీస్తు ప్రేయర్ ఎంటర్‌లో క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కుష్టు వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నిర్వాహకులైన గాదె వెంకన్న కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పాస్టర్ ఎం.అబ్రహ్మాం అధ్యక్షతన బ్రదర్ కె.పవన్‌కుమార్, జార్ఖండ్ వాసి బ్రదర్ మద్దా బీమయ్య భవనీ, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయి రాజు తదితరులు కీర్తనలు అలపించారు. గాడ్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రసన్న కుమార్, దృశ్య శ్రవన ఉపకరణాలతో బైబిల్, మ్యాజిక్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తును హృదయంలో ప్రతిష్ఠించుకున్న వారికి పరలోకంలో స్థానం ఉంటుందన్నారు. గాదె దుర్గ, సిస్టర్ సూర్యవతి,బ్రదర్ సత్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. తణుకు ఈపీఎఫ్ ఆధ్వర్యంలో పాస్టర్ మోజెస్ ప్రవీణ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పార్థనలు కొనసాగాయి. చిన్నారులు నాటికలతో అలకరించారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఊపందుకున్న దాళ్వా పనులు



అత్తిలి మండలం బల్లిపాడు ప్రాంతంలో పంట దమ్ములు చేసిన దృశ్యం

**అత్తిలి:** మండలంలో దాళ్వాసాగు పనులు ఊపందుకున్నాయి. నారుమడులు పోసి, పంటదమ్ము చేసే పనులలో రైతాంగం నిమగ్నమైంది. అత్తిలి మండలంలో 13,500 ఎకరాలలో దాళ్వా సాగు చేపట్టారు. మండల పరిధిలో బల్లిపాడు, వరిఘేడు, గుమ్మంపాడు ఆయకట్టు ప్రాంతంలో వరినాట్లు వేయడానికి రైతులు మురుగుదుమ్ములు చేస్తున్నారు. ఈడూరు ప్రాంతంలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. మండలంలో సుమారు 90 శాతం మేర నారుమడులు పూర్తి అయ్యాయి.

**దాళ్వా సాగుకు అనువైన రకాలు**

ఎంటీయూ 1121(శ్రీధృతి) ఎంటీయూ 3626 (ప్రభాత్), ఎంటీయూ 1153(చంద్ర), ఎంటీయూ 1010(కాటన్ దొర సన్నాలు), ఎంటీయూ 1156 (తరంగణి), ఎన్‌ఎల్ఆర్ 34449(నెల్లూర్ మసూరి), ఎంటీయూ 1210( సుజాత), ఎంటీయూ రైస్ 1293, ఎన్‌ఎల్ఆర్ 3238, ఎన్‌ఎల్ఆర్ 3354 (నెల్లూర్ ధాన్యరాశి), ఎన్‌ఎల్ఆర్ 40024( స్వేత) వరి వంగడాలను సాగు చేసుకోవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో మంచి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో 3 దఫాలుగా దమ్ముచేసి చదును చేసి, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలని, 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. శిలీంద్రనాశినితో శుద్ధి చేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలన్నారు. ముక్కు పగిలిన విత్తనాలను నారుమడిలో సమానంగా పలుచటి నీటి పొర ఉంచి విత్తుకోవాలి, మరుసటి రోజు నారుమడిలో నీటిని మొత్తం తీసివేయాలన్నారు.

## స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ పాత్ర కీలకం



తాడేపల్లిగూడెం(టీఓసీ): జెండా ఆవిష్కరణ చేస్తున్న సీపీఐ నాయకులు



ఇరగవరం: తూర్పు విప్పరులో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



పెంటపాడు: గేట్‌సెంటర్‌లో జెండా ఆవిష్కరణ చేస్తున్న సీపీఐ నాయకులు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ కీలకపాత్ర పోషించిందని పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సీపీఐ శత వసంతం పండుగను గురువారం పట్టణంలో సీపీఐ కపర్థి భవనంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సీపీఐ జెండాను ఆవిష్కరించారు. పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర నాయకులు పిలుపు మేరకు రానున్న సంవత్సరం కాలంలో సీపీఐ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలు, త్యాగాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పడుతున్న అన్ని భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య నాయకురాలు వడ్డది మేరీ, ఎం.నాగలక్ష్మిలకు సత్కారం చేశారు. నాయకులు దాస్యం రాము, జానా ప్రసాద్, నిమ్మకాయల కుమార్, వర్రే కోటేశ్వరరావు, పుట్ట రాంబాబు, బ్రహ్మాజీ, లక్ష్మణరావు, సోము శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**సీపీఐ శత జయంతి ఉత్సవాలు**

**ఇరగవరం:** మండలంలోని తూర్పు విప్పరు గ్రామంలో గురువారం సీపీఐ శత వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనకు అవిశ్రాంత కృషి చేసిన పార్టీ సీపీఐ అని తెలిపారు. ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న హక్కులను గత 11 సంవత్సరాల కాలంలో కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని ధ్వజమెత్తారు. తూర్పు విప్పరులోని సీపీఐ ఆఫీస్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నామన వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు గుడిమెట్ల కోటేశ్వరరావు, కుడిపూడి వెంకట రెడ్డి, చిక్కాల బ్రహ్మయ్య, కాటూరి రాముడు, బొరుసు ఏసు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా సీపీఐ శత జయంతోత్సవం**

**పెంటపాడు:** మండలంలోని పెంటపాడు గేట్‌సెంటర్‌లో గురువారం సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు మాట్లాడారు. రష్యా విప్లవం స్ఫూర్తితో 1925 డిసెంబర్ 26న కాన్పూరులో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. దిద్దే నాగేశ్వరరావు, బండారి శ్రీనివాసరావు, కొణతాల నాగరాజు, తాటిపాముల రాంబాబు, మెర్ప శేఖర్ తదతరులు పాల్గొన్నారు.

## రంగా ఆశయ సాధనకు కృషి

**తణుకు అర్బన్:** బడుగు, బలహీన వర్గాలు, శ్రామికుల ఆరాధ్యుడిగా పేరుగాంచిన దివంగతనేత వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు కృషి చేయాలని కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వరప్రసాద్ అన్నారు. రంగా వర్ధంతి సందర్భంగా గురువారం తణుకు వంగవీటి మోహనరంగా వీధిలో ఉన్న ఆయన విగ్రహానికి కాపు సంఘం ఆధ్వర్యంలో పూలమాలలువేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, కాపు సంఘ నాయకులు అడ్డాల రామకృష్ణ, గాజుల కాశీ, కృష్ణ, కాకిలేటి హరినాథ్, జనసేన నాయకులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, అనుకుల రమేష్, టీడీపీ నాయకులు మారుతీరావు పాల్గొన్నారు.

**ఆదర్శప్రాయుడు వంగవీటి మోహనరంగా**

**అత్తిలి:** బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు వంగవీటి మోహనరంగా అందరికీ ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా అత్తిలి సంతమార్కెట్ సెంటర్‌లో ఉన్న మోహనరంగా, వైఎస్సార్ విగ్రహాలకు మండల వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అత్తిలి ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు పోలినాటి చంద్రరావు, గారపాటి నాగరాజు, కంకటాల సతీష్, యడ్లపల్లి దుర్గారావు పాల్గొన్నారు.



తణుకులో రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

**వంగవీటి మోహన్ రంగా చిరస్మరణీయుడు**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** వంగవీటి మోహన్‌రంగా చిరస్మరణీయులని పలువురు వక్తలు కొనియాడారు. రంగా వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**వంగవీటి అడుగుజాడల్లో నడవాలి**

**పెంటపాడు:** వంగవీటి రంగా అడుగుజాడల్లో నడవాలని పలువురు పిలుపునిచ్చారు. స్వర్గీయ వంగవీటి మోహన రంగా వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని రంగ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెరుకూరి జగత్ సోమశేఖర్(పండు), మజ్జి అప్పారావు, మట్టా రాంబాబు, బలగం మాచారయ్య, సత్యనారాయణ, మద్దాల చిన్ని, అడ్డాల గోపి, తోట శంకర్, కామిశెట్టి నాగు తదితరులు పాల్గొన్నారు.